


నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

# కార్మికుల సమస్యలపై పోరాడుతాం

- నేడు అన్ని గనులపై అధికారులకు వినతి పత్రాలు
- ఈ నెల 25న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నాలు
- టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్



ఆర్కే న్యూటెక్ గనిపై పోస్టర్లు అతికిస్తున్న నాయకులు

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 21: కార్మిక సమస్యలు పరిష్కరించే వరకూ పోరాడుతామని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కే సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ అన్నారు. సింగరేణిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చేపట్టే ఆందోళన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌తో పాటు ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్లను సోమవారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొగ్గు గనుల వేలం, సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కార్మికులకు మెరుగైన వసతుల కోసం మంగళవారం గనులు, ఓసీపీల్లో అధికారులకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 25న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. అండర్‌గ్రౌండ్, ఓపెన్‌కాస్ట్ గనుల్లో ప్రైవేటీకరణను పూర్తిగా నిలిపివేయాలని, సింగరేణి గనులను వేలం ప్రక్రియను నిలిపివేసి, గుజరాత్‌లో కేటాయించినట్లుగా నామినేషన్ పద్ధతిలో సింగరేణికి గనులను కేటాయించాలన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ అనేక వాగ్ధానాలు చేసి ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. టీబీజీకేఎస్ హయాంలో రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో కారుణ్య నియామకాలు, ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ ద్వారా వేలాది మందికి ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. యూనియన్ బలోపేతం, రజతోత్సవ సభ సక్సెస్‌పై ఈ నెల 23న గోదావరిఖని కేంద్ర కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశామని, ఈ సమావేశానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేష్‌రెడ్డి, ఎండీ లాలా, బానోతు రాజునాయక్, గడ్డం మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సాదుల భాస్కర్, గోపాల్, తోట నరేశ్, జైపాల్‌రెడ్డి, సతీశ్‌యాదవ్, సల్మాన్, తిరుపతిరెడ్డి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్కే న్యూటెక్ గనిపై ప్రచారం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 21 : ఈ నెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభపై 'చలో వరంగల్' పోస్టర్లను అంటించి సోమవారం శ్రీరాంపూర్ ఆర్కే న్యూటెక్ గనిపై టీబీజీకేఎస్ నాయకులు గని పిట్ కార్యదర్శి ఉప్పాల సంపత్, కేంద్ర కమిటీ సభ్యుడు బుద్ధి ప్రసాద్, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జి ఆడ్లూరి అనిల్, నాయకుడు జయకృష్ణ ప్రచారం చేశారు. సింగరేణిలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 25 టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో అన్ని జీఎం ఆఫీస్‌ల ఎదుట ధర్నాలకు సంబంధించిన పోస్టర్ల కూడా అంటించారు. సింగరేణి కార్మికులకు కేసీఆర్ అనేక హక్కులు కల్పించారని గుర్తు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

# అర్హుల జాబితాను రూపొందించాలి

**కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 21: రాజీవ్ యువ వికాసం పథకానికి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హుల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని సంబంధిత అధికారులను కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, అల్పసంఖ్యాక వర్గాలు, ఇతర వెనుకబడిన తరగతుల అభ్యర్థుల నుంచి అందిన దరఖాస్తుల పరిశీలన మార్గదర్శకాలపై సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీఆర్డీవో దత్తారావుతో కలిసి ఎంపీడీవోలు, బ్యాంకుల మేనేజర్లు, ఏపీఎంలు, కార్పొరేషన్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 15వ తేదీ వరకు సర్వే ప్రక్రియ పూర్తి చేసి జిల్లా స్థాయి కమిటీకి జాబితా అందించాలని, అర్హులైన వారికి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న మంజూరు పత్రాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వరి జోషి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గిరివికాసంపై నిర్లక్ష్యమేలా.?

- అడవిబిడ్డల దరిచేరని పథకం
- బోర్లు తవ్వి నెలలు గడుస్తున్నా విద్యుత్ సౌకర్యం లేదు
- మోటర్లు ఏర్పాటు చేయలే



రైతు కుడిమెత దౌలత్‌రావు చేనులో వేసిన గిరివికాసం బోరు వేసి ఏళ్లు గడుస్తున్న మోటారు బిగించలేదు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : గిరి రైతుల సంక్షేమం కోసం తీసుకొచ్చిన 'గిరి వికాసం'పై ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఇది వరకు మంజూరు చేసిన యూనిట్లకు విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడం.. కరెంట్ మోటర్లు ఏర్పాటు చేయకపోవడంతో పథకం లక్ష్యం నీరుగారిపోతున్నది.

## ఒక్కో యూనిట్‌కు రూ.3.50 లక్షలు

ఐటీడీఏ ద్వారా అమలు చేస్తున్న గిరి వికాసం పథకంపై అధికారులు పట్టింపులేనట్లుగా వ్యవహరిస్తున్నారు. పదెకరాలకో యూనిట్ (ఐదెకరాలు కలిగిన ఇద్దరు రైతులు.. లేక అంతకంటే తక్కువ భూమి కలిగిన ముగ్గురు రైతులకు కలిపి ఒక యూనిట్)ను అమలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఒక్కో యూనిట్ కింద రూ. 3.50 లక్షల దాకా కేటాయించారు. ఈ పథకం ద్వారా చేలల్లో బోర్లు వేయడం.. విద్యుత్ లేన్‌లు ఏర్పాటు చేయడం.. విద్యుత్ మోటర్లు బిగించడం వంటివి చేయాల్సి ఉంటుంది. కానీ అధికారులు ఇవేవీ పట్టించుకోకపోవడం వల్ల యూనిట్లు మంజూరైన రైతులకు ఫలితం లేకుండా పోయింది..

## కేవలం 13 యూనిట్లే..

జిల్లాలో గతంలో గిరి వికాసం పథకం కింద 169 యూనిట్ల కోసం రూ. 92 లక్షల దాకా ఖర్చుచేశారు. రైతుల చేల వద్ద 482 బోరుబావులను తవ్వించారు. విద్యుత్ లేన్‌ల ఏర్పాటు కోసం రూ. కోటీ 78 లక్షలు కూడా కేటాయించారు. కానీ ఆపై విద్యుత్ లేన్‌లు గాని, మోటర్లుగాని ఏర్పాటు చేయలేదు. ఇప్పటి వరకు మొత్తంగా 13 యూనిట్లు మాత్రమే పూర్తిస్థాయిలో అమలు చేశారు. మిగతా వాటికి విద్యుత్ కనెక్షన్‌లు, మోటర్లు ఏర్పాటు చేయకపోవడంతో బోర్లన్నీ నిరుపయోగంగా మారాయి. ఓ వైపు కొన్ని నెలలుగా గిరి వికాసం పథకానికి నిధులు కేటాయించకపోవడం.. మరోవైపు అటవీ ప్రాంతంలో ఉండే వ్యవసాయ భూములకు విద్యుత్‌లేన్‌లు వేసేందుకు అటవీశాఖ ఆంక్షలు విధించడం అడవిబిడ్డలకు శాపంగా మారింది.



రైతు టేకం రాంషావ్ చేనులో వేసిన గిరివికాసం బోరు వేసి ఏళ్లు గడుస్తున్నా మోటారు బిగించలేదు



## వాంకిడిలో భారీ వర్షం

వాంకిడిలో కురుస్తున్న వర్షం

వాంకిడి, ఏప్రిల్ 21 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వాన కురవడంతో వాంకిడి మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో సుమారు మూడున్నర గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రజలు, దుకాణాదారులు, చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



సొమ్మొకొకరిది.. సోకొకరిది

రామకృష్ణాపూర్‌లోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి

# బ్రిడ్జి కట్టింది బీఆర్ఎస్
# బిల్డప్ ఇచ్చేది కాంగ్రెస్

**కేసీఆర్ హయాంలోనే రామకృష్ణాపూర్‌లో ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణం**

- మాజీ విప్ బాల్క సుమన్ ప్రత్యేక చొరవతో 90 శాతం పనులు పూర్తి
- 10 శాతం పనులు పూర్తి చేసేందుకు 16 నెలలా?
- వారధి ప్రారంభించి విద్యుద్దీపాలు ఏర్పాటు చేయని వైనం
- రాత్రి పూట ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 20 : సొమ్మొకరిది.. సోకొకరిది.. అన్న చందంగా ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రగతిని పట్టించుకోకపోగా, కేసీఆర్ సర్కారు చేసిన పనులకు కొబ్బరికాయలు కొడుతూ.. ప్రారంభోత్సవాలు చేస్తూ.. గొప్పలు చెప్పుకుంటున్నది. బీఆర్ఎస్ హయాంలోనే రామకృష్ణాపూర్ రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి దాదాపు పూర్తికాగా, ఇటీవల కేవలం పది శాతం పనులు చేసి బిల్డప్ ఇస్తున్న 'హస్తం' నేతల తీరు విమర్శలకు తావిస్తున్నది.

## బాల్క సుమన్ వచ్చాకే బ్రిడ్జి పనులు..

కేంద్ర ప్రభుత్వం 2013– 2016 మధ్యకాలంలో క్యాతనపల్లి రైల్వే బ్రిడ్జికి రూ.31 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటనలు వెలువడ్డాయి. సుమారు రూ.4.10 కోట్లతో పనులు సైతం మొదలు పెట్టారు. కానీ భూ సేకరణకు నిర్వాసితులు నిరాకరించడం, భూములు ఇవ్వకపోవడంతో జాప్యం జరిగింది. చెన్నూరు ఎమ్మెల్యేగా బాల్క సుమన్ గెలిచాక భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించారు. అప్పటికే భూములు ఇవ్వమని నిర్వాసితులు కోర్టుకు వెళ్లారు. ఆందోళనలు చేశారు. ఒకానొక దశలో కొట్లాటలు, వివిధ పార్టీల ఆందోళనలు అన్నింటినీ ఎదుర్కొని భూసేకరణ పూర్తి చేయించారు. చివరకు 2018 ఆగస్టులో కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ జరిగింది. రైల్వే బ్రిడ్జికి అనుసంధానంగా రోడ్డు నిర్మాణానికి రూ.27.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. భూవివాదాలన్నీ సమసిపోయి 2019 జూలైలో పనులు మొదలయ్యాయి. 2020 మార్చిలో కరోనా మహమ్మారి కారణంగా రెండేళ్లు పనులు నిలిచిపోయాయి. ఈ సమయంలో బ్రిడ్జి నిర్మాణంలో మార్పులు చోటు చేసుకోవడంతో అదనంగా రూ.7.50 కోట్ల నిధులు మంజూరు చేయించారు అప్పటి ఎమ్మెల్యే బాల్కసుమన్. వెంటనే పనులు మొదలుపెట్టించి 2024 అసెంబ్లీ ఎన్నికల నాటికి 90 శాతం పనులు పూర్తి చేయించారు. ఇంతలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పనులు మళ్లీ జాప్యమయ్యాయి. 10 శాతం పనులు చేయడానికి 16 నెలల సమయం పట్టింది. ఎట్టకేలకే రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రారంభమైంది. ఇది ముమ్మాటికీ గత ప్రభుత్వ హయాంలో జరిగిన కృషి ఫలితమే అనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రారంభోత్సవానికి హడావుడి చేసి గొప్పలు చెప్పుకున్న నాయకులు.. ప్రారంభించి ఐదురోజులు పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకు బ్రిడ్జిపై విద్యుద్దీపాలు అమర్చలేకపోయారు. దీంతో రాత్రి వేళ బ్రిడ్జిపై ప్రయాణం చేయడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. ప్రారంభించిన రెండు రోజులకే రైల్వే అధికారులు రైల్వే గేటును శాశ్వతంగా మూసివేశారు. విద్యుద్దీపాలు లేని ఫ్లై ఓవర్‌పై ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు తీసుకుంటారని జనాలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక అధికార పార్టీ లీడర్లు, అధికారులపై ఈ విషయంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



విద్యుత్‌దీపాలు లేక రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై కమ్ముకున్న చీకట్లు

## బ్రిడ్జిపై ప్రయాణం సుమన్ కృషి ఫలితమే



రామకృష్ణాపూర్ పట్టణ ప్రజల ఏళ్లనాటి కల క్యాతనపల్లి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం. ఎంతో మందిని బలిగొన్న రైల్వే గేటు కష్టాలను తొలిగించి, దాని స్థానంలో బ్రిడ్జి నిర్మాణం చేయడం బాల్క సుమన్ కృషి ఫలితమే. బ్రిడ్జిపై ప్రయాణాలు సాగించే ప్రతి ఒక్కరూ ఆయననే గుర్తు చేసుకుంటారు. క్యాతనపల్లిని మున్సిపాలిటీగా చేసి, పట్టణంలో నివాసముంటున్న 4 వేల మందికి సింగరేణి ఇండ్ల పట్టాలు ఇప్పించిన ఘనత గత ప్రభుత్వానికే దక్కుతుంది.

*- కంభగోని సుదర్శన్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, రామకృష్ణాపూర్*

## విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలి



క్యాతనపల్లి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై విద్యుద్దీపాలు ఏర్పాటు చేయలేదు. రాత్రివేళ ప్రమాదాలు జరిగితే బాధ్యులు ఎవ రు. గతంలో బ్రిడ్జి నిర్మా ణంలో జాప్యం జరుగు తుందని కావాలనే గగ్గో లు పెట్టిన నాయకులు ఇప్పుడు విద్యుద్దీపాలు ఏర్పాటు చేయకుండానే ప్రారంభించడం శోచనీయం. ఆర్భాటంగా బ్రిడ్జిని ప్రారంభించి ప్రజల రక్షణను గాలికి వదిలేశారు. ఇప్పటికైనా బ్రిడ్జిపై లైటింగ్ ఏర్పాటు చేయాలి.

*- రామిడికుమార్, రామకృష్ణాపూర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు*



అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్



అర్జీలను స్వీకరిస్తున్న ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

# అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**ప్రజావాణిలో మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, ఏప్రిల్ 21 : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులు, అర్జీలను పరిశీలించి పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బీఐఎస్ కేర్ యాప్‌నకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అన్ని ప్రభుత్వ శాఖలు మార్కెట్‌లోని ఉత్పత్తులు బీఐఎస్ ప్రమాణాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉత్పత్తుల నాణ్యతా ప్రమాణాలను తెలుసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఐఎస్ జిల్లా ప్రతినిధి రాళ్లబండి రాజన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 21: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అర్జీలను సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.